క్లుప్తంగా

అనూషదేవికి అభినందనలు



అనూషదేవిని సత్కరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ఎంపీపీ అనూషదేవిని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తదితరులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఎంపీపీగా ప్రజలకు చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించి మహిళా విభాగంలో రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం శుభ పరిణామన్నారు. ప్రజలకు మరింత సేవ చేయాలని సూచించారు. గూడెంకొత్తవీధి ఎంపీపీ కుమారి, సర్పంచ్ దురియా పుష్పలత, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీలు ధారలక్ష్మి, జయలక్ష్మి, లోవరాజు కో–ఆప్షన్ సభ్యులు నాజర్‌వలీ, స్వచ్ఛంధ్ర డైరెక్టర్ మీరా, నాయకులు గిరి, రామారావు పాల్గొన్నారు.

పాస్టర్లకు దుస్తుల పంపిణీ



పాస్టర్లకు దుస్తులు, క్యాలెండర్లు అందజేస్తున్న రెవరెండ్ బియట్రిస్

హుకుంపేట: మండలంలోని పూర్తికగరువు గ్రామంలో ఆశ్రయ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆశ్రయ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవరెండ్ డాక్టర్ జీమనోహార్ జ్ఞాపకార్థంగా పేదలు, పాస్టర్లకు, వృద్ధులకు దుస్తులు అందజేశారు. క్యాలెండర్లు, వాక్యపు పుస్తకాలను పంపిణీ చేశారు. ఆశ్రయ్ మినిస్ట్రీస్ సహ వ్యవస్థాపకులు రెవరెండ్ డాక్టర్ బి.ఎమ్ బియట్రీస్ మాట్లాడుతూ క్రీస్తు జీవితం మావవాళికి ఆదర్శనీయమన్నారు. సంస్థ తరఫున ఏజెన్సీలో అనేక ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. దైవసేవకులు మోహన్, పాస్టర్లు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ



గెలుపొందిన విద్యార్థులు, పీఈటీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అరుణకుమారి

మారేడుమిల్లి : నరసరావుపేటలో ఈనెల 12, 13 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి 67వ స్కూల్ గేమ్స్‌లో మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్సి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ టి.అరుణకుమారి శుక్రవారం తెలిపారు. పాఠశాల విద్యార్థి మడకం నాగలక్ష్మి అండర్ –19 విభాగంలో జావలిన్ త్రోలో ప్రథమ స్థానం కేవసం చేసుకోగా, అండర్–17 విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో వించెల మౌలిక తృతీయ స్థానం కైవసం చేసుకున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులను తీర్చిదిద్దిన వ్యాయమ ఉపాధ్యాయుడు దూడ ప్రమోద్, విజేతలను అభినందించారు.

బాధిత కుటుంబానికి తక్షణ సాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న సిబ్బంది, నాయకులు

కూనవరం: వైఎస్సార్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెల్ఫేర్ అసిస్టెంట్ సంకీర్తన సూచించారు. చూచిరేవులగూడెం సచివాలయం పరిధి పలూరు గ్రామానికి చెందిన నూపా శిరమయ్య అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సహాయంగా మృతుడి కుటుంబానికి సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ శుక్రవారం రూ10,000 నగదు అందజేశారు. సచివాలయం కన్వీనరులు సత్యనారాయణ, లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు, మహిళా పోలీసు నిరోషా, వలంటీర్లు, గ్రామస్తులు శ్రీనివాసరావు, సీతారామం తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9676392974, 9390991099
సాక్షి

అక్క చెల్లెమ్మల ఆర్థిక ప్రగతికి ఆసరా



- వైఎస్సార్ ఆసరాతో మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు
- మూడు విడతల్లో చెల్లింపు పూర్తి
- రుణాలతో చిరు వ్యాపారాలు
- ఆనందంలో గిరిజనులు



డ్వాక్రా సంఘ సభ్యుల సమావేశ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి(ఫైల్)

నవరత్నాలు అమలులో భాగంగా గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన, ఉత్పాదకత పెంపునకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రారంభించారు. గత టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు తీరని అన్యాయం చేసింది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళల ఆర్థికాభివృద్ధి కోసం వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టారు. డ్వాక్రా సంఘాలకు రుణాలిచ్చి ఆదుకుంటున్నారు. ఆయా సొమ్మును మహిళలు చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబ పోషణ సాగిస్తున్నారు. ఇప్పటికే మూడు విడతల్లో చెల్లింపులు జరిగాయి. దీంతో గిరిజన మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీలేరు: మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఈ పథకం ద్వారా డ్వాక్రా సంఘాలకు రుణాలను ప్రభుత్వం అందజేస్తోంది. ఆయా రుణాలతో సంఘ సభ్యులు చిరు వ్యాపారులు చేసుకొని, కుటుంబ పోషణకు చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు గూడెం కొత్తవీధి మండలంలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మూడు విడతలుగా రూ.3.33 కోట్లు మంజూరైంది. ఈ ప్రాంతంలో ఆర్థికంగా వెనకబడిఉన్న గిరిజన అక్క చెల్లెమ్మలకు ఎంతో ఉపయోగకరంగా మారింది. దీని ద్వారా చిరు వ్యాపారాలు పెట్టుకొని గిరిజనులు బతుకుతున్నారు.

టీడీపీ హయాంలో సాయం శూన్యం

టీడీపీ ప్రభుత్వ హయాంలో మహిళా సంఘాలకు తీరని అన్యాయం జరిగింది. 2014 ఎన్నికలకు ముందు డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. దీంతో మహిళలు రుణాలు చెల్లించలేదు.అనంతరం అధికారంలోకి వచ్చాక బాబు ఆ హామీ ఊసే ఎత్తలేదు. దీంతో మహిళలు తీసుకున్న రుణాలకు అప్పుకు వడ్డీతో సహా చెల్లించాల్సిన దుస్థితి తలెత్తింది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ ఆసరా ద్వారా రుణాలు అందించి ఆదుకుంటున్నారు. ఇప్పటివరకు మూడు విడతల్లో డ్వాక్రా రుణాలను ప్రభుత్వం మంజూరు చేసింది.

పథకం యొక్క ప్రయోజనాలు

- వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నిరుపేద ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల మహిళలకు ఆర్థిక సహాయం అందిస్తోంది.
- మైనార్టీలకు చెందిన మహిళకు రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక రుణాలను ఇస్తోంది.
- డ్వాక్రా సంఘ సభ్యులకు రుణాన్ని అందిస్తోంది.

రుణ సాయం

- సీలేరు మేజర్ పంచాయతీలో 35 డ్వాక్రా సంఘాలు ఉండగా అందులో 354 మంది మహిళలు ఉన్నారు. వీరికి 3 విడతలుగా ప్రభుత్వం ద్వారా రూ.58,55,418లు మంజూరు చేసింది.
- దుప్పులవాడ పంచాయతీలో కాట్రగెడ్డలో 19 సంఘాలకు 69 మహిళలకు రూ.5.60లక్షలు మంజూరు చేసింది.

మండలం : జి.కే.వీధి మండలం		
పంచాయతీలూ	:	16
గ్రామాలు	:	545
వీవోలు	:	42
జనాభా	:	60,000
సీలేరులో మొత్తం గ్రామైక్య సంఘాలు	:	291
మొత్తం సభ్యులు	:	3,200
మూడు విడతలుగా మంజూరైన సొమ్ము	:	రూ.3.33కోట్లు

- దారకొండ పంచాయతీ పేట్రాయి గ్రామంలో 15 సంఘాలకు 155 మంది సభ్యులకు రూ 27,96,909.75లు అందజేసింది.
- కమ్మరితోట గ్రామంలో రెండు సంఘాలు ఉండగా 21 మంది సభ్యులకు మూడు విడతలుగా రూ. 4,22,442/లు మంజూరు చేసింది.



సమావేశంలో పాల్గొన్న డ్వాక్రా సంఘ సభ్యులు



డ్వాక్రా సభ్యులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అర్హులందరికీ రుణాలు



పంచాయతీ పరిధిలో అర్హత ఉన్న అన్ని డ్వాక్రా సంఘాలకు వైస్సార్ ఆసరా పథకం అందిస్తున్నాము. మూడు విడతలుగా ఆసరా సొమ్ము అందించాం.నాలుగవ ఆసరా కోసం దరఖాస్తులు కూడా తీసుకుంటున్నాము. ఆసరా పథకం కోసం అర్హులను గుర్తించేందుకు సర్వే చేస్తున్నాం.

– గంగిరి పార్వతి, వీవో

ఇచ్చిన హామీని నెరవేర్చారు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే మహిళలకు అన్ని విధాలుగా ఆదుకుంటోంది. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.15వేలు తీసుకున్నాను. దీంతో తిను బండరాలు తయారు చేసి అమ్ముకుంటున్నాను. అమ్మఒడి, చేయూత తదితర పథకాలు మహిళలకు ఎంతగానో ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయి.

– సావిత్రమ్మ, సీలేరు

జగనన్నకు రుణపడి ఉంటాం



జగనన్న ప్రభుత్వం రావడం వల్ల మా లాంటి కుటుంబాలు ఆర్థికంగా బాగుపడ్డాయి. ప్రభుత్వం అందిస్తున్న చేయూత, ఆసరా, తదితర పథకాలు పేద కుటుంబాలకు ఎంతగానో ఆదుకుంటున్నాయి. నేను వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇప్పటివరకు రూ.3లక్షలు తీసుకున్నాను. జగనన్నకు రుణపడి ఉంటాం.

–వాసు, సీలేరు డ్వాక్రా సభ్యురాలు

మెరుగైన సేవలు అందించాలి



రంపచోడరంలో సమావేశంలో మాట్లాడుతున్న మురళీ



రాజవొమ్మంగిలో వెల్ఫేర్ అసిస్టెంట్ సుధీర్‌ను సన్మానిస్తున్న మురళీ తదితరులు

ఏపీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ మురళీ

రంపచోడవరం/అడ్డతీగల/రాజవొమ్మంగి: ఏజెన్సీలోని అన్ని గ్రామ సచివాలయాల్లో నిబంధనల ప్రకారం వివిధ రకాలైన సేవలు ప్రజలకు అందించాలని ఏపీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ జె.మురళీ ఆదేశించారు. రంపచోడవరం నియోజకవర్గంలోని రంపచోడవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి ప్రాంతాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో రంపచోడవరం, మారేడుమిల్లి మండలాలకు సంబంధించిన గ్రామ సచివాలయాల కార్యదర్శులతో, మహిళా పోలీసులతో, ఏఎన్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లంతా మెరుగైన ప్రజా సేవలందించాలన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను వందశాతం అమలుకు కృషిచేసి ప్రతి పేదవాడి మోములో చిరునవ్వే ధ్యేయంగా సచివాలయాల సిబ్బంది పనిచేయాలన్నారు. గ్రామ సచివాలయాల సిబ్బంది, గ్రామ వలంటీర్లు, ఏఎన్ఎంలకు, మహిళ పోలీసులకు రీఫ్రెష్‌మెంట్ శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ సచివాలయాల్లో అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చడానికి దోహదపడాలన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో అందే విధంగా, జాబ్ చాట్, టెక్నికల్ అంశాలు తదితరపై శిక్షణ ఇస్తున్నట్టు చెప్పా. ప్రతి గ్రామంలో పిల్లలను పాఠశాలలకు పంపే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని గ్రామ సచివాలయాల సిబ్బందిని ఆదేశించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలు, వివిధ రకాలైన సేవలు ప్రజలకు అందించే బాధ్యత సంబంధిత సచివాలయాల సిబ్బందిపై ఉందన్నారు. సచివాలయాలకు సంబంధించిన సమస్యలు ఉంటే తెలిపాలని ఎంపీడీవోలకు సూచించారు. ఈ శిక్షణ వల్ల సచివాలయాల ద్వారా నాణ్యమైన సేవలు ప్రజలకు అందుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ రమణ, డీఎల్‌డీవో కె.కోటేశ్వరరావు, ఎంపీడీవోలు హరికృష్ణ, వీరకిషోర్, కె.బాపన్నదొర, ఎల్.యాదగిరీశ్వర రావు , ఎంపీపీ గోము వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదాపై అవగాహన



విద్యుత్ ఆదాపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

హుకుంపేట: ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం విద్యుత్ అధికారులు విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ రమణ మాట్లాడుతూ గిరిజనులు విద్యుతుని ఆదా చేయాలన్నారు. పనికి తగ్గట్టుగానే విద్యుత్‌ను వినియోగించుకోవాలని, ఎల్ఈడీ బల్బులు వినియోగించాని సూచించారు. సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో అమ్మవారి ప్రచార రథం



పూజలు చేస్తున్న భక్తులు

గంగవరం : విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి వారి ప్రచార రథం శుక్రవారం మండలంలో పర్యటించింది. మండలంలోని పాతరామవరం, నెల్లిపూడి, కొత్తాడ, గార్లపాడు మీదుగా గంగవరం చేరుకుంది. గంగవరం నుంచి అడ్డపల్లి, ఏటిపల్లి గ్రామాల మీదుగా అడ్డతీగల వెళ్లింది. అమ్మవారి రథానికి భక్తలు ఘన స్వాగతం పలికారు. స్థానిక శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద కుంకమ పూజలు నిర్వహించారు. సమరసత ఫౌండేషన్ కన్వీనర్ చిన్నాలుదొర, ప్రచారక్ అబ్బాయిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ఇంటింటా సంక్షేమ వెలుగులు



మాకవరంలో సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరిస్తున్న నేతలు



భూర్జలో బుక్‌లెట్‌లకు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ మత్స్యలింగం నాయకులు

హుకుంపేట: మండలంలోని భూర్జ పంచాయితీలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్.కొండలరావు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం పాల్గొన్నారు. గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో ఇంటింటా సంక్షేమ వెలుగులు విరాజిల్లుతున్నాయన్నారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామకృష్ణ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మెన్ ఎస్.కొండలరావు, నాయకులు జైరామ్, రాజారావు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని మాకవరం పంచాయతీ కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నేతలు పల్లెకి పోదాం కార్యక్రమం నిర్వహించారు.గ్రామంలో గిరిజనుల వద్దకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు అడిగి తెలుసుకున్నారు.అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి,పార్టీ జెండాను ఎగురువేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు మల్లికార్జున్,సర్పంచులు గంగాధర్, వసంత, ఎంపీటీసీ సోయిత, జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, మండల కన్వీనర్ కొండలరావు, నేత శివ,సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వన సమారాధనలు



జి.మాడుగులలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



రాజవొమ్మంగి గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థినుల నృత్యాలు



కొయ్యూరులో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

జి.మాడుగుల: స్నేహబంధాలకు వన భోజన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని గురుకులం కళాశాల ప్రిన్సిపాల్ పారయ్య అన్నారు. స్థానిక గురుకులం కళాశాలలో శుక్రవారం వన భోజన వేడుక కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. కళాశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అలరించాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.కె.దొర, చింతపల్లి గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ రామేశ్వరం, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక గిరిజనసంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో (ఏపీఆర్‌జేసీ) శుక్రవారం జరిగిన వనసమారాధన వేడుకలో ఆ పాఠశాల బాలికల నృత్యాలు ఆకట్టుకొన్నాయి. పచ్చని వనాల మధ్య కళాశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి అధికారులు, సహ పాఠశాలలు, వసతి గృహ ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంలు, సిబ్బందికి విందు ఏర్పాటు చేశారు. విద్యార్థినులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అధికారులు పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ సలోమి సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు: స్థానిక జూనియర్ గురుకుల కళాశాలలో శుక్రవారం వన భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ రాజారావు, ఎంపీపీ బడుగు రమేష్ మాట్లాడుతూ మార్చిలో ప్రారంభం కానున్న పరీక్షలకు సంబంధించి ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా చదవాలని సూచించారు. ప్రిన్సిపాల్ సూరిబాబు, అధ్యాపకులు శ్రీనివాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సాబ్జీ మృతికి సంతాపం



షేక్ సాబ్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నేతలు

గంగవరం/ముంచంగిపుట్టు: ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై యూటీఎఫ్ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గంగవరం, ముంచంగిపుట్టు ప్రాంతాల్లో శుక్రవారం సాబ్జీ సంతాప కార్యక్రమాలు నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి కృష్ణ, కార్యదర్శి ఎం.ధర్మారావు తదితరుల మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సాబ్జీ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఇటీవల షేక్ సాబ్జీ గంగవరం ప్రాంతాల్లో పలు పాఠశాలలను సందర్శించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలులర్పించారు. రాంబాబు దొర, వెంకటేశ్వరరావు, దొర, రాజు, గోపీ, ఎంఆర్‌పీలు అనిల్, హరి, సురేష్ పాల్గొన్నారు.

డేగలపుట్టులో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



డేగలపుట్టులో వైద్య సేవలు అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ శిరీష

ముంచంగిపుట్టు: మండలంలోని కర్రిముఖిపుట్టు పంచాయతీ డేగలపుట్టు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ శిరీష తన సిబ్బందితో వెళ్లి వైద్య సేవలు అందించారు. మొదట 53 మంది రోగులకు ఓపీ చూసి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి రోగుల వివరాలను సేకరించి, మెరుగైన వైద్య సేవలు అందించి, పలు సూచనాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వైద్యం అందిస్తున్నామని, అవసరమైతే ఆరోగ్య కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామని, ముఖ్యంగా నడవలేని పరిస్థితిలో ఉన్న రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామన్నారు. వైద్య సిబ్బంది,104 సిబ్బంది, ఆశా కార్యకర్తలున్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

జి.మాడుగుల/కొయ్యూరు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్లు చేపడుతున్న సమ్మె శుక్రవారం కూడా కొనసాగింది. జి.మాడుగులలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సిబ్బంది, మహిళా పోలీసులు తెరిచి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఆగ్రహించిన అంగన్‌వాడీ కార్యకర్తలు ఐసీడీఎస్ కార్యాలయంలో సిబ్బందిని బయటకు పంపి తాళాలు వేసి నిరసన తెలిపారు. తహసీల్దార్ అప్పలస్వామికి వినతిపత్రాన్ని అందజేశారు. కొయ్యూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు.

నేడు గౌరమ్మ ఉత్సవం

కశింకోట: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) మహోత్సవం నిర్వహించనున్నట్లు సర్పంచ్ కన్నం శ్యాంసన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అద్దెపల్లి శ్రీను శుక్రవారం తెలిపారు. ఉత్సవంలో భాగంగా మధ్యాహ్నం 2 గంటలకు గుర్రపు పరుగు పందేలు నిర్వహించి, నగదు బహుమతులుఅందించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం తీన్‌మార్, మహిళల కోలాటాలతో గౌరమ్మ సారె ఊరేగింపు జరగనుందన్నారు. విశాఖ థ్రిల్లర్, సాయి ఏబీసీడీ ఈవెంట్స్ డాన్స్ బేబీ డాన్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



డ్వామా పీడీ కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ ప్రతినిధులు

పాడేరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ డివిజన్ అధ్యక్షుడు ఉబ్బేటి కోటేశ్వరరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని డ్వామా పీడీ శివయ్యకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. పనిదినాల టార్గెట్ విధానం రద్దు చేయాలని, ఎఫ్‌టీఈ అమలు చేయాలని వినతిలో కోరారు. శంకర్‌రావు, సంజీవరావు, తదితరులు ఉన్నారు.

అనంతగిరి: మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీడీవో శ్రీహర్షిత్‌కు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు శుక్రవారం కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. కనీసం వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వినతిలో పేర్కొన్నారు. గోపీ, శాంతి, కోటేశ్వరరావు, తదితరులున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్ :
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com